
సాక్షి ఒడిశా

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,69,154లు, బంగారం 1గ్రాము 900 మిల్లీగ్రాములు, వెండి 107 గ్రాములు 350 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



బీజేపీలోకి మాజీ ఎంపీ అర్క కేశరి దేవ్

కలహండి మాజీ ఎంపీ, రాజ కుటుంబ సభ్యుడు అర్క కేశరి దేవ్, ఆయన భార్య మాళవికా దేవీలు బీజేడీని వీడి బీజేపీలో బుధవారం చేరారు.

- 8లో

ప్రాణం తీసిన లోయ



స్కూటీ అదుపుతప్పి లోయలో పడిన దుర్ఘటనలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలైన ఘటన కొరాపుట్ జిల్లా నారాయణపట్నం సమితి లంగడ్‌బేడ గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది.

- 8లో

న్యూస్‌రీల్

పిడుగుపాటుకు మహిళకు గాయాలు



రష్మీబాగ్‌ను చికిత్స కోసం తరలిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి జగదల్‌పూర్ పంచాయతీ పరిధి ఘుసిరిగుడ గ్రామంలో ఒక మహిళపై పిడుగు పడడంతో తీవ్రగాయాల పాలయ్యింది. గ్రామానికి చెందిన రష్మీబాగ్ (20) మంగళవారం సాయంత్రం పొలం పనులను ముగించుకొని ఇంటికి వస్తోంది. ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఒక చెట్టు కింద నిలబడింది. అదే సమయంలో పిడుగు పడడంతో ఆమె తీవ్రగాయాలకు గురయ్యింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే పీహెచ్‌సీకి చికిత్స కోసం తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలియజేశారు.

భూసారంతో నాణ్యమైన దిగుబడులు



రైతులకు సూచనలు చేస్తున్న విద్యార్థినులు

పర్లాకిమిడి: భూసారంతో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని సెంచూరియన్ వర్సిటీ వ్యవసాయ విద్యార్థులు అన్నారు. స్థానిక ఆరోమైలు రాసూరు గ్రామంలో భూసార పరిస్థితులపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఎరువులు, రసాయనాలు ఎంత మోతాదులో వాడాలో వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు ఎ.అపర్ణ, ఎస్.సుప్రితా రెడ్డి, రచన ప్రభా పట్నాయిక్, డి.మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో బాలిక మృతి



అంబిక హరిజన్ మృతదేహం

జయపురం: స్థానిక బొరిగుమ్మ సమితి చారిగాం గ్రామంలో పిడుగు పాటుతో గోపతి హరిజన్ కుమార్తె అంబిక హరిజన్(14) మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం మధ్యాహ్నం గ్రామంలో కుండపోత వర్షం కురిసింది. ఆ సమయంలో బాలిక తమ పూరి గుడిసెలోనే ఉంది. అయితే అదే సమయంలో ఆ గుడిసెపై పిడుగులు పడడంతో కాలిపోయి బాలిక మృత్యువాత పడింది. గ్రామస్తులు వెంటనే బొరిగుమ్మ అగ్నిమాపక కార్యాలయానికి తెలియజేశారు. అగ్నిమాపక హవల్దార్ నారాయణ సాహు,ఫైర్‌మెన్ డి.స్పైయ్, ఆర్.పటేల్‌లు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం బాలికను అంబులెన్స్‌లో బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే బాలిక మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బిడ్డ మరణించడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11 కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసులు మంగళవారం రాత్రి గోవిందపల్లి-జయపురం ప్రధాన రహదారిలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో బైక్‌పై ఇద్దరు వ్యక్తులు ఒక బస్తాను తీసుకొస్తుండడం గమనించి తనిఖీ చేశారు. దీంతో బస్తాలో గంజాయి స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. నిందితులను విచారణ అనంతరం కోర్టులో బుధవారం హాజరుపరిచారు. నిందితులు రాయగడ జిల్లా దొరగుడ గ్రామానికి చెందిన రాకేష్ మాఝి, రామ్‌చంద్ర మాఝిలుగా నిర్ధారించారు. గంజాయిని చిత్రకొండ సమితిలో కొని బైక్‌పై రాయగడ తరలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.70 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

సీఎం క్షమాపణలు చెప్పాలి

- ప్రజా వ్యతిరేకులు అనే పదం సరికాదు
- బీజేపీ చీఫ్ విప్ మోహన్ చరణ్ మాఝి
- సభలో హక్కుల ఉల్లంఘనపై రచ్చ



భువనేశ్వర్: ఈనెల 25వ తేదీన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ 5టీ కార్యదర్శి గురించి వివరణ ఇస్తూ ప్రతిపక్షాలను ప్రజా వ్యతిరేకులు అనే పదంతో సంబోధించారని, దీనిపై ఆయన క్షమాపణలు చెప్పాలని ప్రతిపక్షం బీజేపీ చీఫ్ విప్ మోహన్‌చరణ్ మాఝి డిమాండ్ చేశారు. బుధవారం సభా కార్యక్రమాలు ప్రారంభం కావడంతోనే ముఖ్యమంత్రిపై ప్రత్యేక హక్కుల ఉల్లంఘన నోటీసుపై చర్చ వేడెక్కింది. శూన్య గంటలో ప్రతిపక్షం మరియు పాలక బిజూ జనతా దళ్ (బీజేడీ) సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. తాము 5టీ కార్యదర్శిపై ముఖ్యమంత్రి నుంచి ప్రకటన కోరలేదన్నారు. ఆయనకు రక్షణ కల్పించాలని సీఎం స్వయంగా సభలో ప్రకటన చేశారన్నారు. ప్రతిపక్షాలను ప్రజా వ్యతిరేకులుగా అభివర్ణించారని, ఇంతకీ ప్రజా వ్యతిరేకి ఎవరని ప్రశ్నించారు. ప్రొసీడింగ్‌ల నుంచి ఆ పదాన్ని మినహాయించాలని కోరారు.

ప్రతిపక్షంపై ఎదురుదాడి

అదే సమయంలో అధికార బీజేడీ సభ్యులు నినాదాలు చేస్తూ ప్రతిపక్షాలపై ఎదురుదాడికి దిగాయి. మరోవైపు శాసన సభ వ్యవహారాల మంత్రి నిరంజన్ పూజారి ప్రతిపక్ష నేతపై హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశపెట్టారు. విపక్షాలు హక్కుల ఉల్లంఘన తీర్మానంలో అసభ్య పద ప్రయోగం ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రతిపక్షాలు అసెంబ్లీని రాజకీయ వేదికగా ఉపయోగించుకోవద్దని హితవు పలికారు. ఈ గందరగోళ పరిస్థితుల మధ్య సభా కార్యక్రమాల నిర్వహణ సాధ్యం కాకపోవడంతో సాయంత్రం 4 గంటల వరకు వాయిదా పడినట్లు వేసినట్లు స్పీకర్ ప్రకటించారు.

అఖిల పక్ష సమావేశం

సభలో అధికార, విపక్ష సభ్యుల రచ్చతో ఏర్పడిన అవాంఛనీయ వాతావరణం నివారించేందుకు స్పీకర్ ప్రమీలా మల్లిక్ చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం వేడెక్కడంతో స్పీకర్ ప్రమీలా మల్లిక్ సభను సక్రమంగా నిర్వహించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో స్పీకర్ సభను 30 నిమిషాల పాటు వాయిదా వేశారు.

ఆరు బిల్లులకు ఆమోదం

శాసనసభలో బుధవారం 6 బిల్లులు ఆమోదం పొందాయి. వీటిలో ఒడిశా ద్రవ్య, సేవల పన్ను (సవరణ) చట్టం-2023, ఒడిశా అపార్ట్‌మెంట్‌లు (యాజమాన్యం మరియు నిర్వహణ) చట్టం-2023, ఒడిశా మున్సిపల్ ఉప చట్టాలు (సవరణ) చట్టం-2023, ఒడిశా రిజర్వేషన్ ఖాళీలు మరియు సేవలు (షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల కోసం) చట్టం, (సవరణ)-2023, ఒడిశా రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ (సవరణ) చట్టం-2023, ఒడిశా భూసేకరణ, పునరావాసం మరియు పునరావాసంలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత (సవరణ) చట్టం-2023 ఉన్నాయి.

కాంగ్రెస్ సభ్యుల వాకౌట్

శాఖలవారీగా మంత్రులు ఈ బిల్లులను ప్రవేశపెట్టారు. అయితే ఈ బిల్లులపై చర్చ జరగలేదని కాంగ్రెస్ శాసనసభ నాయకుడు నర్సింహ మిశ్రా లేచి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ బిల్లుపై చర్చకు తమని ఎందుకు పిలవడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఎప్పుడూ ఇలా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పీకర్ ప్రమీలా మల్లిక్ మాట్లాడుతూ మీరెవరూ చర్చకు చేయి ఎత్తలేదు కాబట్టి పిలవలేదని పేర్కొన్నారు. బిల్లు ఆమోదం కోసం ప్రవేశపెట్టే సమయంలో చర్చలో మాట్లాడేవారు పాల్గొంటారని స్పీకర్ వివరించారు. దీనిని నిరసిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. కొంత సమయం తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఒప్పించేందుకు స్పీకర్ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి నిరంజన్ పూజారి, అధికార పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ ముదులిలను పంపారు. అయినా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభలోకి అడుగు పెట్టలేదు. బిల్లులపై చర్చ జరగకపోవడంతో బీజేపీ ఎమ్మెల్యేలు కూడా తమ సీట్ల వద్ద నిలబడి నిరసన తెలిపారు. సముచిత అవకాశం కల్పిస్తామని స్పీకర్ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. తర్వాత బీజేపీ ఎమ్మెల్యేలు బిల్లు ప్రవేశం పురస్కరించుకుని పలు సవరణలు ప్రతిపాదించారు. తదుపరి పరిశీలన కోసం సెలెక్ట్ కమిటీకి సిఫారసు చేయాలన్నారు. వీరి ప్రతిపాదనలు తిరస్కరించారు. దీంతో ఆయా శాఖల మంత్రులు స్పందించి బీజేపీ ఎమ్మెల్యేల అభ్యంతరాలను తోసిపుచ్చాలని స్పీకర్‌ను అభ్యర్థించారు. అధికార, విపక్ష వర్గాల వాదోపవాదాల మధ్య బిల్లులన్నీ ఆమోదం పొందాయి.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన



సమితి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని రామనగుడ సమితి పరిధి డసరడంగ, డసరడంగ గుడ, కొత్తగుడ గ్రామాల్లో నెల రోజులుగా వేధిస్తున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సమితి కార్యాలయం ఎదుట ఆయా గ్రామాల ప్రజలు బుధవారం ఆందోళన తెలియజేశారు. గ్రామాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. తాగునీరు లేకపోవడంతో నదిలో నీటిని వినియోగించడం వలన రోగాల బారిన పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే తాము తాగేందుకు వినియోగిస్తున్న నది నీటిని తీసుకొచ్చి అధికారుల ముందు ఉంచారు. ఈ మూడు గ్రామాల్లో సుమారు ఆరు వందలకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే వసుధ తాగునీటి పథకం ద్వారా అందరికీ తాగునీటి సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన గొట్టపు బావులు, నెల రోజులుగా పనిచేయక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. సమస్యను పలుమార్లు పంచాయతీ కార్యాలయం అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో నిరసన చేపట్టడం జరిగిందన్నారు. బీడీవో ప్రద్యుమ్న మండంగి ఆందోళనకారులతో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

జూదం అడ్డాలపై ప్రత్యేక నిఘా



మాట్లాడుతున్న ఎస్పీ సార్వణ్ వివేక్

- బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్

బరంపురం: అక్టోబర్ 15వ తేదీ నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో జూదం అడ్డాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ సార్వణ్ వివేక్ తెలియజేశారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన క్రైమ్ సమీక్ష సమావేశం ఐఐసీ అధికారులు, ఎస్డీపీవోలు, డీఎస్పీలు, ఏఎస్పీలతో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరాత్రి పూజల పేరిట బలవంతంగా చందాలు వసూలు చేసేవారిపై కేసులు బనాయించి జైలుకి తరలించాలని ఆదేశించారు. నవరాత్రి ఉత్సవాల పండాల కోసం కలెక్టర్ నుంచి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. పూజా మండపాల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండపాలకు ప్రత్యేక విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి కమర్షియల్ చార్జీలు వసూలు చేయడం జరుగుతుందని వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత ఎటువంటి లౌడ్ స్పీకర్లు వినియోగించకూడదన్నారు. విగ్రహాలను కలెక్టర్ ఇచ్చే రూట్ మ్యాప్ ప్రకారం నిమజ్జనం చేయాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, దుర్గా పూజా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలతోనే జీవకోటికి మనుగడ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: మొక్కలతోనే జీవకోటికి మనుగడ సాధ్యమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జయపురం సమితి పంపుణి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక స్టేట్‌బ్యాంక్ ప్రాంతీయ వాణిజ్య విభాగ మేనేజర్ కాబుల బెహర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. అడవులు పెరిగి పర్యావరణం పరిరక్షించబడాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తెరగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర పండ, స్నేహలత బొడితియ, ఒడిశా పర్యావరణ సమితి సహాయ కార్యదర్శి ఇంజినీర్ మనోరంజన్ మిశ్ర తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం

సాంప్రదాయాలను గౌరవించాలి



సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

పర్లాకిమిడి:

ప్రతి ఒక్కరూ సాంప్రదాయాలను గౌరవించాలని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. స్థానిక టౌన్ హాల్‌లో మంగళవారం రాత్రి నువాఖయి పండుగ భట్టోఘాట్ అనే కార్యక్రమాన్ని పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశ్చిమ ఒడిశాలో ఆడంబరంగా జరుపుకుంటున్న నువాఖయితో ఇక్కడి ప్రజల ఆచార వ్యవహారాల్లో ఐక్యత కన్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సమలై నృత్య పరిషత్ సంస్థ అధ్యక్షుడు నృసింహ చరణ్ పట్నాయక్, కార్యదర్శి బాలకృష్ణ పాణిగ్రాహి, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ప్రధాన కార్యదర్శిగా రమేష్ చంద్ర సాహు



సమావేశంలో పాల్గొన్న రమేష్ చంద్ర సాహు తదితరులు


భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగా రమేష్ చంద్ర సాహు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మీడియా వ్యవహారాల ఇన్‌చార్జి లక్ష్మీధర మహంతి తెలియజేశారు. ద్వైవార్షిక సమావేశాలు పురస్కరించుకుని కార్యవర్గ సభ్యుల ఎన్నిక నిర్వహించారు. శ్రామిక్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగా ఆయన వరుసగా 9వ సారి ఎన్నిక కావడం విశేషం. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బ్రిటిష్ కాలంనాటి చట్టాలను సంస్కరిస్తున్నట్లు చెబుతున్న కేంద్ర ప్రభుత్వం, రైల్వే రంగంలో ఇటువంటి సంస్కరణలపై శీతకన్ను వేస్తోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశాలకు తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజ్ మనోజ్ కుమార్ శర్మ, వాల్తేరు మండలం డీఆర్‌ఎం సౌరవ్ ప్రసాద్, రైల్వే కార్మిక జాతీయ సమాఖ్య (ఎన్‌ఎఫ్ఐఆర్) కార్యదర్శి డాక్టర్ ఎం.రాఘవయ్య తదితర ప్రముఖులు హాజరయ్యారు. సిబ్బంది సంక్షేమానికి 10 ప్రధాన డిమాండ్లతో స్మారక పత్రాన్ని తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్‌కు అందజేశారు. రైల్ కీ చక్కా చల్‌తే రహే, దేశ్ హమార బడ్‌తే రహే నినాదంతో శ్రామిక్ కాంగ్రెసు కార్యకర్తలు ముందుకు సాగాలని కొత్తగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు పిలుపునిచ్చారు.

అంతరిస్తున్న డాల్ఫిన్లు..!



చిలికాలో సంచరిస్తున్న డాల్ఫిన్లు

బరంపురం: చిలికా ఉప్పునీటి సరస్సులో డాల్ఫిన్లు క్రమంగా అంతరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆసియాలోనే అతి పెద్దదైన ఈ సరస్సులో ఉన్న డాల్ఫిన్లను ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది లెక్కించారు. అయితే ప్రస్తుతం వాటి సంఖ్య 113 ఉన్నట్లు నిర్ధారించారు. గతేడాది వీటి సంఖ్య 154 ఉండగా, ఈ ఏడాది 113కు తగ్గింది. సరస్సులోని బిత్తరకొనికా, సతపడా, కృష్ణప్రసాద్, నూవపడా, బోయికులా, బల్లగాం, టాంగి మరియు బల్లుగాం రేంజ్‌ల పరిధుల్లో 10 అటవీ బృందాలు వీటిని లెక్కించాయి. లెక్కింపులో అటవీ, పర్యావరణ, చిలికా అభివృద్ధి సంస్థ, వన్యప్రాణుల సంరక్షణ విభాగాల అధికారులు పాల్గొన్నట్లు చిలికా డివిజనల్ ఫారెస్ట్ అఫీసర్ బి.ఆర్.దాస్ తెలియజేశారు. అయితే ప్రతి ఏడాదీ వీటి సంఖ్య క్రమేపీ తగ్గుతుండడంతో పర్యావరణ ప్రేమికులు, సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సరస్సులో మోటార్ బోట్లు సంచరించడం కారణంగానే డాల్ఫిన్లు అంతరిస్తున్నట్లు వన్యప్రాణుల సంరక్షణ విభాగం పరిశోధనలో తేలినట్లు స్పష్టమవుతోంది.



సరస్సులోని సత్తపడా దీవిలో విన్యాసం చేస్తున్న డాల్ఫిన్లు

ముగిసిన సబ్ కమిటీ సమావేశం

- శ్రీమందిరం భూములపై కీలక నిర్ణయాలు

భువనేశ్వర్: శ్రీమందిరం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ల్యాండ్ సబ్ కమిటీ సమావేశం ముగిసింది. పలు ప్రాంతాల్లో విస్తరించి ఉన్న శ్రీజగన్నాథుని భూములపై ప్రధానంగా చర్చించారు. కటక్, భువనేశ్వర్, ఖుర్దా మరియు నయాగడ్ తదితర జిల్లాల్లో స్వామివారి భూములను కొనుగోలు చేసేందుకు పలువురు ఔత్సాహికులు ముందుకొచ్చారు. దీంతో ఆయా ప్రాంతాల జిల్లా ల్యాండ్ కమిటీ ఆమోదించిన వివిధ దరఖాస్తులను సమావేశంలో పరిశీలించారు. తదుపరి కార్యాచరణ కోసం పాలక మండలికి సిఫారసు చేశారు. కటక్ జిల్లా రెండు ప్రాంతాల్లో భూవివాదం పరిష్కారం కోసం ల్యాండ్ సబ్ కమిటీ నిర్ణయించింది. జగన్నాథ్ సర్వీసు ఫౌండేషన్, హైదరాబాద్ ప్రాజెక్టు డైరెక్టర్ వాటరు షెడ్, ఖుర్దా రెండు సంస్థలు జట్నీలో రెండు చోట్ల జీడి చెట్ల పెంపకం కోసం స్వచ్ఛందంగా ముందుకొచ్చాయి. కమిటీ సభ్యులు ఈ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిర్వహిస్తారు. ఈ స్థలాల్లో పెంపకానికి అనుకూలమైన చెట్ల జాతులు, తోట నిర్వహణ, పెంపకం తదనంతర ప్రయోజనాలు వగైరా అంశాలతో క్షేత్రస్థాయి పర్యవేక్షణ నివేదికని ఈ కమిటీ దాఖలు చేస్తుంది. రథ కలపగా అక్కరకు వచ్చే చెట్ల పెంపకం అవకాశాలను ప్రత్యేకంగా పరిశీలిస్తారు.



ల్యాండ్ సబ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

మఠ సంప్రదాయం పునరుద్ధరణకు చర్యలు

శ్రీ జగన్నాథుని సంస్కృతిలో కీలకపాత్ర పోషించే మఠ సంప్రదాయం పునరుద్ధరణకు ప్రత్యేక కార్యాచరణ కోసం ఈ సమావేశంలో ప్రతిపాదించారు. దీనికోసం దేవదాయ కమిషన్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్, ల్యాండ్ సబ్ కమిటీ, శ్రీజగన్నాథ ఆలయం పాలక మండలి సభ్యులతో కూడిన సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సబ్ కమిటీ సిఫారసు మేరకు మఠం వర్గాలకు స్థలం కేటాయింపు, రాయితీలు ఇతరేతర అంశాల మార్గదర్శకాలు ఖరారు చేస్తారని శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి తెలిపారు.

ప్రవచన కేంద్రం

నీలాద్రి భక్తి నివాస్ సముదాయం విస్తరణ కోసం సమావేశంలో ప్రతిపాదించారు. ఈ సముదాయంలో ప్రవచనం అనుబంధ కార్యకలాపాల నిర్వహణకు స్థలం అంతంతమాత్రంగా ఉంటుంది. ఈ సమస్య తొలగించేందుకు పరిసరాల్లో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలంలో ప్రవచన కేంద్రం నిర్మాణానికి ప్రతిపాదించారు. ఈ స్థలంలో 150 గదులతో సువిశాల ప్రవచన ప్రాంగణం, ప్రసాద సేవన కోసం పెద్ద హాలు నిర్మాణం ప్రతిపాదనల్ని ప్రాథమికంగా పరిశీలనలోకి తీసుకున్నట్లు వివరించారు.

క్లుప్తంగా

29న అండర్-19 స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్‌గేమ్స్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 29న నిర్వహించనున్నట్లు అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 2005 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించి ప్రస్తుతం విద్యనభ్యసిస్తున్న 8,9, 10, ఇంటర్‌మీడియట్ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చోరీకేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: చోరీకేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ విజయానంద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 17న రాత్రి ఫూల్‌బాగ్‌లోని పీవీజీనగర్‌లో బంగారు వస్తువులు తయారుచేసే పొన్నాడ అప్పలరాజు తన ఇంటికి తాళం వేసుకుని, అత్త వారింటికి విశాఖ వెళ్లి, తిరిగి రాత్రికి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి, బెడ్‌రూమ్‌లో బీరువా తాళాలు తెరిచి ఉన్నాయి. అందులో ఉన్న ఎనిమిదిన్నర తులాల బంగారు నగలు, నగదు చోరీ జరిగినట్లు గుర్తించి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ ప్రారంభించి బుధవారం సాయంత్రం నల్లచెరువు నాలుగురోడ్ల జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఫూల్‌బాగ్ పీవీజీనగర్‌కు చెందిన పటాన్ అస్లామ్, షేక్ షాజన్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేసి వారి నుంచి ఎనిమిదిన్నర తులాల బంగారు వస్తువులు, బంగారు బిస్కెట్ ముక్కలు, రూ.ఆరు లక్షల నగదును రికవరీ చేశారు. నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బొండపల్లి: మద్యం తాగవద్దని భార్య మందలించినందుకు మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనపై ఎస్సై ఎస్.రవి తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వెదురువాడ గ్రామానికి చెందిన చంపి తమ్మన్నదొర (40) నిత్యం మద్యం తాగి ఇంటికి వచ్చి కుటుంబసభ్యులతో గొడవ పడుతుండడంతో భార్య మందలించింది. దీంతో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో 108 వాహనంలో గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కొత్తవలసలో మరొకరు..

కొత్తవలస: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో నివాసముంటున్న ఒమ్మి భాస్కర్ రావు (36) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై సీఐ వి.చంద్రశేఖర్ తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. భాస్కర్‌రావు వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కాగా ఇటీవల ఇంట్లో జరిగిన కొన్ని పరిణామాలకు తోడు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది మంగళవారం మధ్యాహ్నం మద్యంలో బొద్దింకల మందు కలిపి ఇంటి వద్దే తాగేశాడు. దీంతో వాంతులు ఎక్కువగా అవడంతో చెంతనే ఉన్న సోదరుడు అనిల్ అడగ్గా పురుగు మందు తాగినట్లు తెలిపాడు. వెంటనే మండల కేంద్రంలో గల ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి విశాఖ కేజీహెచ్‌కు సోదరుడు అనిత్ తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఏనుగుల సంచారంపై అప్రమత్తం

పార్వతీపురంటౌన్: ఏనుగుల సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా అటవీశాఖాధికారిణి జీఏపీ ప్రసూన తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒంటరి ఏనుగు హరి కొమరాడ మండలం నడిమివలస కొండపై ఉందని, రాత్రి సమయాల్లో కొండ దిగువకు వస్తోందని, తెల్లవారు జామున కొండవీదకు వెళ్తోందని తెలిపారు. రేగులపాడు, పెదఖేర్జల, చినఖేర్జల, బుజిగవలస, నడిమివలస మెట్ట, కోటిపాం, కుమ్మరిగుంట, అర్తాం గ్రామ ప్రజలు సాయంత్రం, తెల్లవారు జామున పొలాలకు వెళ్లేటప్పుడు, ప్రయాణాలు సాగించినప్పుడు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ముందస్తు సమాచారాన్ని అటవీ అధికారుల నుంచి తీసుకోవాలని సూచించారు.

పెదమేరంగి కూడలి వద్ద ఏడు ఏనుగులు

ఏడు ఏనుగులు పెదమేరంగి కూడలి వద్ద రామినాయుడువలస గ్రామం సమీపంలో ఉన్నాయని తెలిపారు. ఏనుగులను అటవీశాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు.

పంటనష్టంపై చర్యలు

పంటనష్టంపై అటవీశాఖ చర్యలు తీసుకుంటుందని, సంబంధిత శాఖలను సమన్వయపరిచి నష్టపరిహారాన్ని అంచనా వేయడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఆస్తులకు సంబంధించి నష్టపరిహారం అంచనా విలువలు సంబంధిత తహసీల్దార్ కార్యాలయం నుంచి అందిన వెంటనే చెల్లింపులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత రేంజ్ అధికారుల నుంచి నష్టపరిహారం పొందవచ్చునని పేర్కొన్నారు. హరి ఏనుగు సమాచారం కోసం ఉలిపిరి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె. సత్యనారాయణ ఫోన్ 9398468628నంబర్‌కు, మిగిలిన ఏనుగుల సమాచారానికి బోరి బీట్ ఆఫీసర్ ఎం.కిరణ్ ఫోన్ 9440595181 నంబర్లను సంప్రదించాలని సూచించారు.


మజ్జిగౌరి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీలో లభించిన విదేశీ కరెన్సీ



హుండీలో నగదును లెక్కిస్తున్న దృశ్యం



రాయగడ: ఉత్కాళాంధ్రుల ఆరాధ్యదైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారి హుండీ ఆదాయాల లెక్కింపు బుధవారం చేపట్టారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, బాబు దొలాయి, దేవేంద్ర బెహర, రాష్ట్ర దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుకాంత్ పూజారి తదితరుల సమక్షంలో మందిర ప్రాంగణంలోని 9 హుండీలను తెరిచారు. భక్తులు కానుకల రూపంలో హుండీలో వేసిన వాటిలో 53 గ్రాముల బంగారం, 1 కేజీ 797 గ్రాముల వెండితో పాటు రూ.68,74,140ల నగదు లెక్కపెట్టారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన లెక్కింపు కార్యక్రమం రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. స్థానిక మహిళా కళాశాల విద్యార్థులు, శ్రీవేంకటేశ్వర మందిరం సేవాదళ్ సభ్యులు తదితరులు ఈ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఏడాది జూన్ 21వ తేదీన హుండీ లెక్కించగా అప్పట్లో నగదు రూ.58,24,950లు, వెండి 1 కిలో 650 గ్రాములు మరియు బంగారం 39 గ్రాములు లభించినట్లు రాయసింగి బిడిక తెలియజేశారు. అదేవిధంగా విదేశీ కరెన్సీ నోట్లు కూడా హుండీలో లభించాయన్నారు.

ఈనెల 30వ తేదీలోగా రెండు వేల నోట్ల మార్పిడికి సమయాన్ని దృష్టిలో పెట్టుకుని హుండీ తెరవడం జరిగిందన్నారు. ఇదిలాఉండగా హుండీల ఆదాయాన్ని ఈసారి యూనియన్ బ్యాంక్‌లో డిపాజిట్ చేయడం జరుగుతుందన్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల రూపంలో వచ్చే ఆదాయాన్ని మందిరం అభివృద్ధి కోసం ఉపయోగిస్తున్నట్లు వివరించారు.

ప్రాణం తీసిన లోయ

- దసరా పండగకు నాటుకోళ్ల కోసం వెళ్లి వస్తుండగా అదుపుతప్పిన బైక్
- లంగడ్‌బేడ వద్ద లోయలోపడి ముగ్గురు గిరిజన యువకులు దుర్మరణం
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు
- అనసబద్రలో విషాదం



లోయలో యువకుల మృతదేహాలు



మృతిచెందిన బాలరాజు, జయరాజు, శివ(ఫైల్)

రాయగడ/మక్కువ:

దసరా పండగకు నాలుగు డబ్బులు సంపాదించాలని బయలుదేరిన ముగ్గురి యువకులను మృత్యువు కాటేసింది. లోయ రూపంలో అందని లోకాలకు తీసుకుపోయింది. కుటుంబ సభ్యులకు కన్నీరుమిగిల్చింది. కొరాపుట్ జిల్లా నారాయణపట్నం సమితి లంగడ్‌బేడ గ్రామ సమీపంలో బుధవారం జరిగిన దుర్ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మక్కువ మండలం దబ్బగెడ్డ పంచాయతీ అనసబద్ర గ్రామానికి చెందిన జన్ని బాలరాజు(21), మర్రి శివ(23), జయరాజు(22)లు బుధవారం ఉదయం కోళ్లు కొనుగోలు చేసేందుకు ఆంధ్రా సరిహద్దులోని ఒడిశా గ్రామాలకు వెళ్లారు. అక్కడ చౌకగా దొరికే కోళ్లు కొనుగోలుచేసి దసరా పండగకు స్థానికంగా విక్రయిస్తే నాలుగు డబ్బులు సంపాదించుకోవచ్చన్న ఆశతో స్కూటీపై ముగ్గురు యువకులు ఉత్సాహంగా వెళ్లారు. తిరిగి వస్తుండగా వీరి స్కూటీ నారాయణపట్నం సమితి లంగడ్‌బేడ వద్ద ఘాట్ రోడ్డులో అదుపుతప్పింది. అంతే.. 120 అడుగుల లోతులో ఉన్న లోయలో పడి దుర్మరణం చెందారు. ఉదయాన్నే వెళ్లిన పిల్లలు ఇంకా రాలేదన్న ఆతృతతో ఎదురుచూస్తున్న తల్లిదండ్రులకు మృతివార్త తెలియడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుల్లో బాలరాజు వలంటీర్‌గా పనిచేస్తుండగా, మిగిలిన ఇద్దరు యువకులు వ్యవసాయకూలీలు.



కుమారుడు వస్తాడని ఆశగా ఎదురు చూస్తున్న శివ తల్లి

శోకసంద్రంలో అనసబద్ర

అనసబద్ర గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృతితో గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. బాలరాజు తల్లిదండ్రులు నారాయణ, రత్నాలు వ్యవసాయకూలీలు. జయరాజు నాన్న సోమయ్య మృతిచెందగా, అమ్మ శైలజ ఉంది. ఇప్పుడు కొడుకు మృతివార్తను తట్టుకోలేదని ఆమెకు తెలియకుండా గ్రామస్తులు గోప్యంగా ఉంచారు. అన్నయ్య, అమ్మ నల్లమ్మతో కలిసి కుటుంబానికి చేదోడుగా ఉంటున్న శివ మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. నారాయణపట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం కోసం అక్కడి సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రాయగడ: రక్తదానం చేస్తున్న విద్యార్థులు



జయపురం: రక్తదానం చేస్తున్న విద్యార్థిని

రాయగడ: రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని వక్తలు పేర్కొన్నారు. స్థానిక అటానమస్ కళాశాలలో రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో 51 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బబిలత షరప్, బ్లడ్ బ్యాంక్ అధికారి డాక్టర్ గౌతం పట్నాయక్‌ల పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

జయపురం: స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో కళాశాల యూత్ రెడ్‌క్రాస్ సభ్యులు జయపురం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సాయంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 40 యూనిట్ల రక్తం సేకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి మిశ్ర రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరాన్ని యూత్ రెడ్‌క్రాస్ కౌన్సిల్ మరియు కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ కనకలత మహాపాత్రో, జాతీయ సేవా యోజన కార్యనిర్వాహక అధికారి సునీల్‌కుమారి ప్రధాన్, సీమా మహాపాత్రోలు పర్యవేక్షించారు. స్వచ్ఛంద సంస్థల సభ్యులు, విద్యార్థులు, అధ్యాపకులు, యువ సమాజ సేవకులు, విక్రమదేవ్ స్వయం పాలిత కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

లారీని ఢీకొని వ్యక్తి మృతి

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి సమీపంలో మంగళవారం రాత్రి ఓ వ్యక్తి బైక్‌పై వస్తూ ఆగిఉన్న లారీని ఢీకొని మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. జి.సిగడాం మండలం పెంట గ్రామానికి చెందిన లావేటి గణేష్ (27) స్వగ్రామం నుంచి రాజాం ద్విచక్రవాహనంపై వస్తుండగా పొగిరి సమీపంలోని లెప్రసీ ఆస్పత్రి వద్ద రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని సోదరుడు సంతోష్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పి.నీలావతి తెలిపారు.

నిప్పంటుకుని వృద్ధురాలు..

పార్వతీపురంటౌన్: చుట్ట ముట్టించుకుంటున్న సమయంలో చీర అంటుకుని ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ సంఘటనపై జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బలిజిపేట మండలంలోని గౌరీపురం గ్రామానికి చెందిన జె.సీరమ్మ (80)మంగళవారం చుట్ట ముట్టించుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు చీర కొంగు ముట్టుకుని అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆమె తీవ్రగాయాల పాలుకాగా కుటుంబసభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ శరీరం సహకరించకపోవడంతో బుధవారం మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు.

చికిత్సపొందుతూ బాలుడు..

బాదంగి: మండలంలోని గొల్లాది గ్రామానికి చెందిన వలసకూలీ కుటుంబంలో తల్లీకుమారులు చెన్నైలో జరిగిన రైలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదానికి సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గొల్లాది గ్రామానికి చెందిన నాయుడు అప్పన్న, భార్య మంగమ్మ(45), చెన్నైకి వలస వెళ్లారు. వారి పిల్లలు కుమారుడు నవీన్ (12), కుమార్తె దివ్య స్వగ్రామంలోనే చదువుకుంటున్నారు. గ్రామంలో చదువుతున్న పిల్లలు రెండునెలల క్రితమే తల్లితో చెన్నై వెళ్లారు. నవీన్ తల్లితో పాటు పనిలోకి వెళ్లి తిరిగివస్తుండగా రైలు ప్రమాదంలో ఇద్దరూ తీవ్ర గాయాల పాలయ్యారు. తల్లి ప్రమాదస్థలంలోనే మృతి చెందగా నవీన్‌ను ఆస్పత్రిలో చేర్చారు. మంగమ్మ మృతదేహం బుధవారం గ్రామానికి చేరుకోగా అంత్యక్రియలు నిర్వహించారు. చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన నవీన్ మృతదేహం గురువారానికి స్వగ్రామానికి చేరుకుంటుందని గ్రామస్తులు తెలిపారు.

కదం తొక్కిన గిరిజనులు



మాట్లాడుతున్న గిరిజన సంఘాల నాయకులు

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియ సమితి నీలగూడ పంచాయతీ ఉస్కుళ్‌బాగ్ గ్రామానికి చెందిన గిరిజనులు బుధవారం కథం తొక్కారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ ప్రాంతంలో దాల్మియా సిమెంట్ కంపెనీ నిర్మిస్తామని గతంలో గిరిజనులతో సమావేశమయ్యారు. అప్పుడే ఫ్యాక్టరీ కడితే ఉస్కుళ్‌బాగ్, నాందిగూడ, కటమాట్టేరు తదితర గ్రామాలకు నష్టం వాటిల్లుతుందని గిరిజనులు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకించారు. అయితే దీనిపై ప్రభుత్వం స్పందించకపోవడంతో బుధవారం భారీ సమావేశం నిర్వహించారు. గ్రామంలోని అడవిలో ప్రైవేట్ సంస్థలు కంపెనీలు నిర్మించడానికి భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. భూమి మాది, నీరు మాది, అడవి మాది అని నినాదాలు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే రానున్న రోజుల్లో భారీ ఆందోళనలు చేస్తామని గిరిజన సంఘ అధ్యక్షుడు ఆకాష్ కుమార్ సోడి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘ సభ్యులు కృష్ణచంద్ర మడ్కామి, నీలిగుడ సర్పంచ్ దేవ్ మాడీ, కలిమెల సమితి వైస్ ప్రెసిడెంట్ లఖ్మ మాడీ, మాల మాడీ, కమాల్ సాయి మాఝి, మిని మాడ్కమిలు తదితరులు పాల్గొన్నారు.

హాకీ, తైక్వాండో క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది నిర్వహించే అండర్-14,17 బాల, బాలికల క్రీడా పోటీలకు ప్రతిభగల క్రీడాకారులను ఎంపిక చేస్తామని జిల్లా స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో అండర్-14 విభాగంలో బాల,బాలికలకు హాకీ పోటీలు, అండర్-14,17 బాల, బాలికల విభాగాల్లో తైక్వాండో పోటీలు నిర్వహించారు. హాకీ పోటీలకు 90 మంది బాల, బాలికలు హాజరుకాగా..వారిలో ప్రతిభ కనబరిచిన 18 మంది బాలురు, 18 బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని అసోసియేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ పేర్కొన్నారు. అలాగే తైక్వాండో పోటీలకు వివిధ పాఠశాలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరుకాగా..ఉత్తమ ప్రతిభకనబరిచిన వారిని జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు త్వరలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపిక ప్రక్రియను వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, సూర్యారావు, కృష్ణమోహన్, ప్రసాద్‌లతో పాటు తైక్వాండో కోచ్‌లు నాగరాజు తదితరులు పర్యవేక్షించారు.

గాంధీ జయంతి నుంచి బీజేడీ పాదయాత్ర

భువనేశ్వర్: బిజూ జనతా దళ్ (బీజేడీ) వార్షిక 'జన్ సంపర్క్ పాదయాత్ర'ను గాంధీ జయంతి పురస్కరించుకుని అక్టోబర్ 2 నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. నవీన్ పట్నాయక్ ప్రజానుకూల కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసే లక్ష్యంతో 10 రోజుల పాటు సాగే ఈ కార్యక్రమం జయ ప్రకాష్ నారాయణ్ జయంతి సందర్భంగా అక్టోబర్ 11న ముగుస్తుంది. ఈ ఏడాది గాంధీ జయంతి, శాస్త్రి జయంతి, ఉత్కళ మణి గోపబంధు దాస్ జయంతి, జయప్రకాష్ నారాయణ్ జయంతి వేడుకలతో పాటు అసెంబ్లీ సెగ్మెంట్ స్థాయిలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు బీజేడీ ఉపాధ్యక్షుడు దేబీ మిశ్రా విలేకరుల సమావేశంలో తెలిపారు. పార్టీ జిల్లా పరిషత్, జోన్ మరియు అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో పౌర సంస్థల స్థాయిలో పార్టీ చురుకైన సభ్యుల కోసం అక్టోబర్ 12 నుంచి ఒక నెల పాటు శిక్షణా శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. పార్టీ రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం మరియు ఇతర సామాజిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 26న అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో బీజేడీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. పాదయాత్ర, ఇతర సంస్థాగత కార్యక్రమాల్లో స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, పంచాయతీ, ప్రజా సంఘాల నాయకులు, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు, ఇతర ముందంజ విభాగాల సభ్యులు పాల్గొంటారని తెలియజేశారు. 2024 ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ప్రభావవంతమైన ప్రయాణం కోసం 85 రోజుల బీజేడీ రోడ్‌మ్యాప్ ఆవిష్కరించింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బీజేడీ నాయకులందరికీ గాంధీ జయంతి నుంచి బీజేడీ వ్యవస్థాపక దినోత్సవం వరకు ప్రతి నియోజకవర్గంలోని ప్రజలతో సంబంధాలను పెంపొందించడం కోసం చేపట్టబోయే కార్యక్రమాల వివరాలు తెలియజేసినట్లు వెల్లడించారు.

బీజేపీలోకి మాజీ ఎంపీ అర్క కేశరి దేవ్



బీజేపీలోకి చేరుతున్న మాజీ ఎంపీ అర్క కేశరి దేవ్ దంపతులు



బీజేపీలో చేరిన పలువురు కార్యకర్తలు

భువనేశ్వర్: బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం విలీనోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కలహండి మాజీ ఎంపీ, రాజ కుటుంబ సభ్యుడు అర్క కేశరి దేవ్, ఆయన భార్య మాళవికా దేవీలు బీజేడీని వీడి బీజేపీలో చేరారు. వీరితో పాటు మదన్‌పూర్ రాంపూర్ రాజ కుటుంబానికి చెందిన తన్మయ్ ప్రతాప్ సింగ్ దేవ్, కుమార్ సాహెబ్ కోడలు మరియు అంతర్జాతీయ సిరామిక్ కళాకారుడు పృథ్వీరాజ్ సింగ్ దేవ్ భార్య కనితా దేవీలు బీజేపీలో చేరారు. భద్రక్ జిల్లా భండారిపొఖొరి నియోజకవర్గానికి చెందిన మాజీ బిజూ జనతా దళ్ మండల చైర్‌పర్సన్ రేవతి నాయక్ మరియు ఆమె భర్త సుధాంశు శేఖర్ నాయక్ సైతం వందలాది మంది మద్దతుదారులతో బీజేపీలో చేరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో స్ఫూర్తి పొంది బీజేపీలో చేరినట్లు వీరు తెలిపారు. ఈ విలీనోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్, కలహండి ఎంపీ బొసాంత్ కుమార్ పండా హాజరయ్యారు.

పదేళ్ల తర్వాత...

కలహండి మాజీ లోక్‌సభ ఎంపీ అర్క కేశరిదేవ్ పదేళ్ల తర్వాత బుధవారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లోకి తిరిగి వచ్చారు. బిజూ జనతా దళ్ (బీజేడీ) అభ్యర్థిగా కలహండి నియోజకవర్గం నుంచి 2014 సంవత్సరం ఎన్నికల్లో పోటీచేసి 16వ లోక్‌సభకు ఎన్నికైన అర్క తన భార్య మాళవికా దేవితో కలిసి బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, కలహండి ఎంపీ బసంత పండా సమక్షంలో కాషాయ పార్టీలో చేరారు. ఆయన తండ్రి, బీజేపీ మాజీ ఎంపీ విక్రమ్ కేశరీ దేవ్ 2013 సంవత్సరంలో కన్ను మూయడంతో ప్రాంతీయ పార్టీ బిజూ జనతా దళ్‌లో చేరారు. 2019 సంవత్సరం సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని పార్లమెంట్ సీట్ల కేటాయింపుపై అసంతృప్తితో బీజేడీకి గుడ్‌బై పలికారు. ఆ తర్వాత ఆయన స్థానంలో కలహండి ఎమ్మెల్యే పుష్పేంద్ర సింగ్ దేవ్ కలహండి పార్లమెంటరీ స్థానానికి పోటీ చేసి పరాజయం పాలయ్యారు. బీజేపీ అభ్యర్థి బసంత పండా చేతిలో ఓడిపోయారు.

దసరా పూజలు ప్రారంభం



గర్భగుడిలో అమ్మవారికి అంకపూజ నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక అంకావీధిలో ఉన్న శ్రీమాణికేశ్వరీ దేవి ఆలయంలో దసరా ఉత్సవాలు అంకపూజతో బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. సరిగ్గా దసరాకి నెలరోజుల ముందు పర్లాకిమిడి అంకావీధి శ్రీమాణికేశ్వరీ దేవి ఆలయంలో దసరా పూజలు ప్రారంభమై విజయదశమితో ముగుస్తాయి. పర్లాకిమిడి గజపతి మహారాజుల ఇలవేల్పు అయిన మాణికేశ్వరీ దేవికి ప్రత్యేక హోమం చేసి పట్టు వస్త్రాలు, బంగారు నాణేలను సమర్పించారు. ఈ మందిరంలో మంగళవారం అమ్మవారికి మార్పు చేపలు నైవేద్యంగా పెడతారు. ఇది ఇక్కడ ఎన్నో ఏళ్లుగా వస్తున్న ఆచారం. అయితే ఈ ఏడాది కొన్ని కారణాల వల్ల యువరాణి కల్యాణి దేవి అంకపూజకు రాకపోవడంతో పూజారి రమేష్ పాత్రో పూజలు చేయించారు. ఈ మందిరానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి అనేక మంది వచ్చి దసరా సందర్భంగా ప్రత్యేక అఖండ నెయ్యి దీపాలు వెలిగిస్తుంటారు. నేటి నుంచి ప్రత్యేక అఖండ దీపాలు, దూపాదులచే అమ్మవారికి పూజలు జరుపుతారు.

కొనసాగుతున్న ఆమరణ నిరాహార దీక్షలు



ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జైలు ఉద్యోగులు



చికిత్స పొందుతున్న ఉద్యోగి సింహాచలం గౌడో

బరంపురం: తమ న్యాయపరమైన ఐదు ప్రతిపాదనలు వెంటనే అమలు చేయాలని కోరుతూ గత మూడు రోజులుగా బరంపురం సర్కిల్ జైల్ ప్రాంగణంలో ఆల్ ఒడిశా జైలు ఉద్యోగస్తుల సంఘం అధ్వర్యంలో బరంపురం సర్కిల్ జైల్ ఉద్యోగస్తులు చేపట్టిన అమరణ నిరాహార దీక్ష బుధవారం కొనసాగింది. దీనిలో భాగంగా మంగళవారం సాయంత్రం దీక్షలో పాల్గొన్న జైలు ఉద్యోగి సింహాచలం గౌడో అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆయనను ఎంకేసీజీ మెడికల్‌కు తరలించి చికిత్స అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అజయ్‌కుమార్ బొరియా మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ గ్రేడ్ పే పెంచాలని, ఉద్యోగస్తులకు పదోన్నతి కల్పించాలని, 15 నెలల జీతం చెల్లించాలని, ఫుడ్ అలవెన్స్ పెంచాలని, జిల్లా పరిధిలో బదిలీలు చేయాలని కోరారు. తమ ప్రతిపాదనలు అమలయ్యేవరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

29న 305 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం వేలం

తెర్లాం: తెర్లాంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఈ నెల 29న ఉదయం 11గంటలకు వివిధ ప్రాంతాల్లో 6ఎ కేసుల్లో సీజ్ చేసిన 305 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని వేలం వేయనున్నట్లు తహసీల్దార్ డి.రత్నకుమార్ చెప్పారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం నిర్వహించనున్న పీడీఎస్ బియ్యం వేలంలో జిల్లాలోని ఏ మండలానికి చెందిన వ్యక్తులైనా పాల్గొన వచ్చని తెలిపారు. ప్రస్తుతం బియ్యం నిల్వలు స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఉన్నాయని, ఎవరైనా వెళ్లి పరిశీలించుకోవచ్చన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.2వేలు ధరావత్తు చెల్లించాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు తనసైనా, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారినైనా నేరుగా సంప్రదించవచ్చని సూచించారు.

క్లుప్తంగా

అన్నదమ్ముల ఇళ్లల్లో చోరీ

- ఎనిమిదిన్నర తులాల బంగారం పట్టుకుపోయిన దుండగులు


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో తాళం వేసిన రెండు ఇళ్లల్లో దొంగలు చొరబడి ఎనిమిదిన్నర తులాల బంగారాన్ని పట్టుకుపోయారు. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. డేఅండ్‌నైట్ కూడలిలో మెడికల్ షాపు నిర్వహిస్తున్న కొచ్చెర్లపాటి ఎస్.వి.శ్రీకాంత్ వర్మ, రవివర్మ సోదరులు ఏపీహెచ్‌బీ కాలనీలో రెండు ఫ్లోర్లు ఉన్న ఇళ్లల్లో వేర్వేరుగా తమ కుటుంబాలతో నివసిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 6:30 గంటలకు ఇళ్లకు తాళం వేసి విజయనగరం జిల్లా రాజాం మండలం మెడకముడిదాంలో బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం పెరడు తలుపులు తీసి ఉండటాన్ని పొరుగువారు గమనించి వెంటనే ఫోన్ చేశారు. హుటాహుటిన ఇంటికి వచ్చి చూసేసరికి రెండు ఇళ్లకూ తలుపులు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. బీరువా తాళాలను తీసి సామాన్లు చిందరవందరగా పడేసి ఎనిమిదన్నర తులాల బంగారు వస్తువులను కాజేశారు. దీంతో ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్‌ఐ బి.గణేష్, క్లూస్ టీమ్ చేరుకుని విచారణ చేపట్టారు. సుమారు 34 తులాల బంగారం, వెండి వస్తువులు ఉండగా అందులో ఎనిమిదిన్నర తులాలు కాజేసినట్లు బాధితులు పోలీసులకు తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

కొబ్బరిలో 99 శాతం ఈ-క్రాప్ పూర్తి


వ్యవసాయ క్షేత్రంలో పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి ప్రసాద్

కవిటి: పథకాల లబ్ధికి ఈ-క్రాప్ తప్పనిసరని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్.వి.వి.ప్రసాద్ అన్నారు. చండిపురం రైతుభరోసా కేంద్రం పరిధిలోని భూముల్లో బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ-క్రాప్ ప్రక్రియ నిర్వహణ తీరును పరిశీలించారు. రైతులు, సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి పోలాకి మాధవీలత, సచివాలయ సహాయకుడు నెయ్యిల గణపతి తదితరులు పాల్గొన్నారు.

3న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగులు సీట్లకు అక్టోబర్ 3న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రవేశం పొందే విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు వర్తించవు. పూర్తిస్థాయి ఫీజును విద్యార్థులే చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్, శ్రీ కాకుళం మహిళా పాలిటెక్నిక్, ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్, టెక్కలి ప్రభుత్వ పాలిటెక్నిక్, సీతంపేట మోడల్ పాలిటెక్నిక్(ఎస్టీ) కళాశాలలతో పాటు ఐతం, శ్రీవేంకటేశ్వరా, శివానీ, నారాయణ, టీవీఆర్ ప్రైవేట్ కాలేజీలు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలల్లో ఖాళీ సీట్లు ఎక్కువగా ఉన్నా ప్రభుత్వ కాలేజీల్లో మాత్రం పరిమితంగానే ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్ల నిర్వహణలో పాలిసెట్ రాసిన విద్యార్థులకు ప్రాధాన్యమిస్తారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రవేశాల సమన్వయ కర్త, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్‌రావు చెప్పారు.

700 మంది దాటితే ప్రత్యేక పోలింగ్ కేంద్రం


మాట్లాడుతున్న డీఆర్వో గణపతి

శ్రీకాకుళం పాతబస్టాండ్ : పోలింగ్ కేంద్రానికి దూరంగా ఉన్న, 700 మంది ఓటర్లకు పైబడి ఉండే అపార్టుమెంట్లలో ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి తెలిపారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 22 నుంచి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతినిధుల సలహాలు, సూచనలు పరిశీలిస్తామన్నారు. సమావేశంలో నాయకులు రొత్తు శంకరరావు(వైఎస్సార్ సీపీ), పి.ఎం.జె.బాబు(టీడీపీ), చల్లా వెంకటేశ్వరరావు(బీజేపీ) తదితరులు పాల్గొన్నారు.

రక్షా కవచం


అనన్య డిగ్రీ విద్యార్థిని. ఆండ్రాయిడ్ మొబైల్ వాడుతోంది. తన ప్రమేయం లేకుండా ఒక్కోసారి కెమెరా ఆన్ కావడం.. లోకేషన్ సెలక్ట్ కావడాన్ని గమనించింది. ఫోన్‌లో ఏదో సస్పీసియస్ యాక్టివిటీ జరుగుతోందన్న అనుమానం.. ఏం చేయాలో తెలియక.. ఎవరికి వివరించాలో పాలుపోక అంతర్మథనంలో పడింది.


మనస్విని ప్రభుత్వ ఉద్యోగిని. తన మొబైల్‌లో కొన్ని అప్లికేషన్ల థంబ్‌నిల్స్ గమనించింది. తాను డౌన్‌లోడ్ చేయకున్నా అవి మొబైల్ స్క్రీన్‌పై ఉండడం.. అన్‌ఇన్‌స్టాల్ చేసినా కాకపోవడంతో ఏం చేయాలో తెలియక అయోమయంలో పడింది.


చందన రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తోంది. తన కుటుంబ సభ్యులతో తాను జరిపిన చాటింగ్ వివరాలను వేరే వ్యక్తి ప్రస్తావించడం గమనించింది. ఎలా సాధ్యం అని ఆలోచించింది. ఆమె ప్రశ్నకు సమాధానం కోసం వెతుకుతోంది





పై ముగ్గురిలానే మీ ఫోన్లలో కూడా ఇలాంటి సందేహాస్పద ప్రక్రియల్ని గమనించారా..! అయితే ఆలస్యం చేయొద్దు. మీ మొబైల్ ఫోన్‌ను పట్టుకుని జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం వద్దకు వెళ్లండి. మీ మొబైల్‌ని స్కాన్ చేసి అటువంటి యాక్టివిటీకి కారణమైన వాటిని తొలగించి మీ మొబైల్‌ను భద్రంగా మీకు అందజేస్తారు. దీనికి సంబంధించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కారు అందుబాటులోకి తెచ్చింది 'దిశా సైబర్ కవచ్'.



- మొబైల్ ఫోన్ భద్రతే లక్ష్యంగా 'దిశ సైబర్ కవచ్'
- ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు
- ఫోన్ స్కాన్ చేసి మాల్‌వేర్ తొలగింపు
- అనుమానాస్పద యాక్టివిటీకి అడ్డుకట్ట



ఫోన్‌ను సైబర్ కవచ్‌కు అనుసంధానించి చెక్ చేస్తున్న సైబర్ ఎక్స్‌పర్ట్ శరత్ పైలా

శ్రీకాకుళం డెస్క్:

సైబర్ మోసాలు దేశవ్యాప్తంగా ఇటీవల ఎక్కువయ్యాయి. ఇలాంటి సైబర్ క్రిమినల్స్ మన మధ్యే ఉంటున్నారు. నమ్మకంగా ఉంటూ స్నేహం పేరుతో కొందరు.. ప్రేమ పేరుతో మరికొందరు.. పరిచయాల పేరుతో ఇంకొందరు మహిళలను వేధింపులకు గురి చేస్తున్నారు. కేవలం ఐదు నిమిషాల పాటు మన మొబైల్ వారి చేతిలో ఉంటే చాలు ఇలాంటి మాల్ వేర్ ఫోన్లలోకి పంపించి వారి ఆధీనంలోకి తెచ్చుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

ఏమిటీ 'కవచ్'..

ఇటీవల కాలంలో పెరిగిన సైబర్ నేరాలు, టెక్నాలజీని దుర్వినియోగం చేస్తూ మహిళలపై వేధింపులు ఎక్కువవుతున్న నేపథ్యంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కారు మహిళా భద్రతా ధ్యేయంగా దిశా సైబర్ కవచ్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. మహిళలు వాడుతున్న మొబైల్ ఎంత సేఫ్‌గా ఉంది.. లేకుంటే ఈ టెక్నాలజీ సాయంతో వాటిని సంబంధిత యాప్‌లు ఇతర వైరస్‌లను తొలగించి మహిళలకు భద్రత.. ప్రాధాన్యం ఇస్తున్నారు జిల్లా పోలీసులు.

మీ మొబైల్‌ను ఏం చేస్తారు..

- దిశ సైబర్ కవచ్ అనేది ఒక కంప్యూటర్ సాఫ్ట్‌వేర్.
- దీనితో మొబైల్‌ను కనెక్ట్ చేసేందుకు వీలుగా వీ 8, సీ పిన్‌లకు సంబంధించిన రెండు యూఎస్‌బీ కేబుళ్లు ఉంటాయి.
- మీ మొబైల్‌కు సంబంధించిన పిన్ సాయంతో కంప్యూటర్‌కు అనుసంధానిస్తారు.
- మొబైళ్లలో ఉండే యాప్‌లు, స్టోరేజీ, ఇతరాలను స్కాన్ చేస్తారు.
- అందులో ఏమైనా మాల్ వేర్ లేదా వైరస్‌లుంటే స్క్రీన్‌పై డిస్‌ప్లే అవుతాయి.
- కంప్యూటర్ గుర్తించినవి వరుస క్రమంలో అక్కడ డిస్‌ప్లే అవుతాయి.
- మీ మొబైల్‌లో ఉండే జనరల్ యాప్స్.. గేమింగ్స్ యాప్స్‌ను వేర్వేరుగా స్కాన్ చేస్తుంది.
- అందులో మాలీసియస్, హైరిస్క్, లో రిస్క్, సేఫ్ తత విభాగాల వారీగా ఎంతెంత శాతం ఏమేం ఉన్నాయో మనకు చూపిస్తుంది.
- రిస్క్ యాప్స్ ఉంటే వాటిని వెంటనే మీ మొబైల్‌లో నుంచి వాటిని సైబర్ కాప్స్ మీ ముందే తొలగిస్తారు.
- మీ మొబైల్‌లో ఎలాంటి సందేహాస్పదమైన ఆప్‌లు లేకుంటే క్లియర్ అని కంప్యూటర్ చూపిస్తుంది.

ఉచితంగా..


దిశ సైబర్ కవచ్ ఉచితంగా వినియోగించుకోవచ్చు. శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న జిల్లా ఎస్పీ కార్యాలయం పని వేళల్లో ప్రజలు ఎవరైనా నిర్భయంగా లోపలకు వచ్చి మీ మొబైల్‌ని పరీక్షించుకోవచ్చు. దీని కోసం ఓ కానిస్టేబుల్‌ను ప్రత్యేకంగా కేటాయించారు. మరిన్ని వివరాలకు **80089 25521** ఫోన్‌లో సంప్రదించవచ్చు.

అపోహలు అవసరం లేదు..



ఇది పూర్తిగా మహిళల భద్రత కోణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రం. మొబైల్ స్కాన్ చేసేటప్పుడు ఫోన్‌లో ఉన్న వ్యక్తిగత సమాచారానికి ఎలాంటి ముప్పు ఉండదు. కేవలం మాల్ వేర్‌ను మాత్రమే కంప్యూటర్ స్కాన్ చేసి ఏరివేస్తుంది. మన సమాచారాన్ని కాపీ చేయడం లాంటివి చేయరు. ఎవరైనా ఈ సేవల్ని వినియోగించుకోవచ్చు.

– జి.ఆర్.రాధిక, ఎస్పీ



మొబైల్ ఫోన్ వాడకంలో పోలీసులు సూచనలు..

- దయచేసి మీ మొబైల్‌ను ఎవరి చేతికి ఇవ్వొద్దు.
- హై సెక్యూరిటీ పాస్‌వర్డ్‌లను ఏర్పాటు చేసుకోండి.
- ఎప్పటికప్పుడు మీ మొబైల్‌ను అప్‌డేట్ చేయించుకోండి. ఈ విషయంలో నిర్లక్ష్యం వద్దు.
- అప్‌డేట్ చేయకుంటే సైబర్ నేరగాళ్లు మీ మొబైల్‌పై సులువుగా దాడి చేయొచ్చు.



ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


ఆస్పత్రిలో శ్రావణి మృతదేహం

పాతపట్నం: తండ్రి మద్యానికి బానిస కావడం, ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండటంతో మనస్తాపానికి గురై ఇంటర్మీడియెట్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నం మేజర్ పంచాయతీ జోగేశ్వరవీధికి చెందిన గుమ్మడి శ్యామల అలియాస్ శ్రావణి(16) పాతపట్నంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతోంది. తండ్రి గుమ్మడి శ్రీను ట్రాలీరిక్షా నడుపుతూ, తల్లి లక్ష్మి కొబ్బరికాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. తండ్రి మద్యానికి బానిస కావడంతో ఇంట్లో తరచు గొడవలు జరిగేవి. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయంలో శ్రావణి తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి మధ్యాహ్నం వచ్చి చూసేసరికి కుమార్తె తాడుకు వేలాడుతుండటంతో స్థానికుల సాయంతో ఆటోలో పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే శ్రావణి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. శ్రావణి రాసిన సూసైడ్ నోట్‌ను గుర్తించారు. తన మృతికి ఎవరూ కారకులు కాదని, తల్లిదండ్రులు తరచు గొడవ పడుతుండటంతో మనస్తాపం చెంది మరణిస్తున్నానంటూ నోట్‌లో పేర్కొంది. పోస్టుమార్టం అనంతరం కుమార్తె మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బీసీ కులగణన చరిత్రాత్మకం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా బీసీ కులగణన చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించడం చరిత్రాత్మకమని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. బీసీ కులగణనకు ఆరుగురు ఐఏఎస్ అధికారులతో అధ్యయన కమిటీ వేయడం హర్షనీయమన్నారు. శ్రీకాకుళం నగరంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్య, ఆరోగ్య ఫలాలు అందించేందుకు బీసీ కులగణన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వందేళ్ల చరిత్రలో ఏపీలో ఇప్పటివరకు కులగణన చేసేందుకు ఏ ప్రభుత్వం ముందడుగు వేయలేదన్నారు. దీనికి బట్టి బీసీల పట్ల సీఎం జగన్‌కున్న అభిమానం ఏ స్థాయిలో ఉందో తెలుస్తుందన్నారు.

శాసనసభలో బీసీ సంక్షేమ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అధ్యయన కమిటీ బిల్లును ప్రవేశపెట్టడం బీసీ జాతికే గర్వకారణమన్నారు. కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు బీసీ గర్జనలో చెప్పినట్లుగా బీసీలంటే వెనుకబడిన కులాలు కాదు దేశానికే బ్యాక్‌బోన్ అని గుర్తు చేశారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే ప్రతిపక్షాలు ఓర్వలేని తనంతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్ మాట్లాడుతూ సాహసోపేత నిర్ణయం తీసుకున్న జగనన్నకు బీసీలంతా రుణపడి ఉంటారని పేర్కొన్నారు. సమావేశంలో పొందర, కురాకుల కార్పొరేషన్ చైర్మన్ ప్రతినిధి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.


శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ దేవ్‌ను సన్మానిస్తున్న కార్పొరేషన్ చైర్మన్లు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన రవికుమార్

టెక్కలి రూరల్: స్థానిక సుదర్శన్ కాంప్లెక్స్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేటకు చెందిన పందిరి రవికుమార్‌కు గాయాలయ్యాయి. టెక్కలి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. రవికుమార్ పలాసలో పెయింటింగ్ పని పూర్తి చేసుకుని మంగళవారం అర్ధరాత్రి తన ద్విచక్ర వాహనంపై టెక్కలి వస్తుండగా సుదర్శన్ థియేటర్ జంక్షన్ వద్ద రహదారిపై స్పీడ్ బ్రేకర్ గమనించక అతివేగంగా వెళ్లాడు. వాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో రవికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సకాలంలో స్పందించిన టెక్కలి పోలీసులు గాయపడిన వ్యక్తిని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై బుధవారం టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటోను ఢీకొట్టడంతో..

పోలాకి: మండలంలో కింజరాపువానిపేట వద్ద పోలాకి-నరసన్నపేట రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సెబ్(ఎక్సైజ్)కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జె.మోహనరావు పోలాకి నుంచి నరసన్నపేట వైపు బైక్‌పై వెళ్తున్న సమయంలో బొరిగివలసకు చెందిన తాపీమేస్త్రీ బొంగు గోపాల్‌కు లిఫ్ట్ ఇచ్చారు. ఇద్దరూ కలిసి వెళ్తున్న సమయంలో ఎదురుగా వెళ్తున్న ఆటోను ఢీకొట్టడంతో కింద పడ్డారు. వెంటనే క్షతగాత్రులను 108లో శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించారు. పోలాకి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి


అరసవల్లి: హెరిటేజ్ వాక్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ ఓబులేసు

- హెరిటేజ్ వాక్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు
- ఘనంగా పర్యాటక దినోత్సవం

అరసవల్లి:

పర్యాటకం కూడా సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమేనని శ్రీకాకుళం నగరపాలకసంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. విద్యార్థి దశ నుంచే సంప్రదాయాల పరిరక్షణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా స్థానిక మహిళా కళాశాల నుంచి జామియా మసీదు వరకు విద్యార్థులు బుధవారం హెరిటేజ్ వాక్ నిర్వహించారు. వాక్‌ను ప్రారంభించిన ఓబులేసు మాట్లాడుతూ.. సంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. జిల్లా టూరిజం అధికారి ఎన్.నారాయణరావు మాట్లాడుతూ.. జిల్లాలో పర్యాటకాభివృద్ధికి మంచి అవకాశాలు, అనుకూల వాతావరణం ఉందన్నారు. ప్రతి పర్యాటక ప్రాంతంలో పచ్చని చెట్లను పెంచాలనే నినాదంతో పనిచేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని వివరించారు. అనంతరం టూరిజం యువక్లబ్ విద్యార్థులు పర్యావరణాన్ని కాపాడాలని, పచ్చని మొక్కలు పెంచాలని నినాదాలు చేశారు. జామియా మసీదు వద్ద యువక్లబ్ సభ్యులు, అధికారులు సంప్రదాయాలను కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ యార్లగడ్డ గీతాశ్రీకాంత్, నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ ఉజ్వల్, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, డీపీఆర్వో బాలమాన్‌సింగ్, జిల్లా ఉపాధి అధికారి సుధ, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్ర, అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటరమణ, టూరిజం సిబ్బంది రమేష్, జామియా మసీద్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

గార: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కె.మత్స్యలేశం సర్పంచ్ బి.లలిత అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బుద్ధా పాఠశాలలోని యువటూరిజం క్లబ్ విద్యార్థులు, హరిత రిసార్ట్స్ సిబ్బంది సంయుక్తంగా బీచ్ శుభ్రత చేపట్టారు. బీచ్‌లోని చెత్తా చెదారాన్ని తొలగించి కాల్చివేశారు. ప్లాస్టిక్ నిషేధం, పచ్చని చెట్లు ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చంద్రమతి, బుద్ధా స్కూల్ చైర్మన్ బి.ఎర్రన్న , కోఆర్డినేటర్ కుమార్, ఉపాధ్యాయులు వాసుదేవరావు, శ్రీను, ఆదినారాయణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.


అరసవల్లి: జామియా మసీదు వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న యువ క్లబ్ సభ్యులు


గార: బీచ్ క్లీనింగ్‌లో యువటూరిజం క్లబ్ సభ్యులు

అరసవల్లిలో 4 నుంచి ధర్మ ప్రచార వారోత్సవాలు

- రూ.35 లక్షలతో ఆలయంలో అభివృద్ధి పనులకు ఆమోదం
- తీర్మానించిన పాలకమండలి సభ్యులు


సమావేశంలో చర్చిస్తున్న పాలకమండలి సభ్యులు

అరసవల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అరసవల్లిలో అక్టోబర్ 4 నుంచి 10 వరకు ధర్మ ప్రచార వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఆలయ పాలక మండలి సభ్యులు తీర్మానించారు. ఈ మేరకు బుధవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో జరిగిన పాలకమండలి సభ్యుల సమావేశంలో కీలక నిర్ణయాలను ప్రకటిస్తూనే పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్, పాలక మండలి ఎక్స్ అఫీషియో మెంబర్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ద్వారపు అనూరాధ, లుకలాపు గోవిందరావు, జలగడుగుల శ్రీనివాస్, జోగి మల్లెమ్మ, మైలపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలివే..

- ఆలయ రాజగోపురం ఆధునీకరణ, ఇంద్రపుష్కరిణి అభివృద్ధి పనులు త్వరగా ప్రారంభించడం.
- ఆలయ పరిసరాల్లో భక్తుల సౌకర్యార్థం మొత్తం 18 పనులకు దేవదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులు తగిన ఎస్టిమేట్లు తయారు చేసిన క్రమంలో రూ.35 లక్షలతో పనులు చేపట్టేందుకు ఆమోదం.
- ఉచిత దర్శన క్యూ కాంప్లెక్స్ పైఅంతస్తులో ఇంజినీరింగ్ ప్లానింగ్ అనుమతులతో అదనంగా 10 వసతి గదులను దాతలే స్వయంగా నిర్మించుకుని ఆలయానికి సమర్పించేలా నిర్ణయాలకు ఆమోదం.
- అరసవల్లి ఆలయానికి దక్షిణాన ఉన్న బ్రాహ్మణ వీధిలో లేటు దూసి రామచంద్రరావు కుమారుడు దూసి ప్రవీణ్‌కు చెందిన 13.63 సెంట్ల భూమిని ఆలయ అవసరాలకు గాను విక్రయించేందుకు జరిగిన ఒప్పందంపై కొనుగోలుకు ఆలయ నిధులు వినియోగించడం.
- ఆలయంలో దినసరి వేతనదారుల్లో సక్రమంగా విధులకు హాజరుకాని సిబ్బందిపై వేటు వేసేలా తీర్మానించారు.

సౌత్‌జోన్ మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో పాఠశాల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నాలుగో సౌత్‌జోన్ పెన్‌కాక్ సిలాట్ మార్షల్ ఆర్ట్స్ పోటీలకు శ్రీకాకుళంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పోటీలు అక్టోబర్ ఒకటి, రెండు తేదీల్లో కేరళలోని త్రివేండ్రం వేదికగా జరగనున్నాయి. ఎంపికైన విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ ముద్దాడ సత్య ప్రసాద్, ప్రిన్సిపాల్ తరిని అర్జున్ చక్రవర్తి అభినందించారు. కోచ్ నక్క లక్ష్మణ్‌నాయుడు, జిల్లా పెన్‌కాక్ శిలాట్ అధ్యక్షుడు రేగిడి దయామయ, అందవరపు రమేష్, కోఆర్డినేటర్ శిరీష, కోచ్ గౌతమి, పీఈటీ లలిత ఉన్నారు.